క్లుప్తంగా

శివాలయం జీర్ణోద్ధరణ పనులకు పూజలు



దాచేపల్లి : మండలంలోని శ్రీనివాసపురం గ్రామ సమీపంలోని బొప్పనాగమ్మ(శివాలయం) పురాతన దేవాలయం జీర్ణోద్ధరణకు బుధవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం పునర్నిర్మాణం కోసం పురావస్తు శాఖ నుంచి రూ.1.50కోట్లు మంజూరయ్యాయి. గర్భగుడి, దేవాలయం, ప్రాంగణాలను విడతల వారీగా అభివృద్ధి చేస్తారు. తొలుత గర్భగుడిలో మరమ్మతుల కోసం లోపలున్న శివలింగాన్ని మరోచోట ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. అర్చకులు వేదమంత్రాలతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మందపాటి రమేష్‌రెడ్డి, జక్కా అశోక్, పల్లపు హనుమంతరావు, మందపాటి శ్రీనివాసరెడ్డి, శరమళ్ల పాపయ్య, శరమళ్ల పరమేశ్వరరావునాయుడు పాల్గొన్నారు.

25న పిడుగురాళ్లలో ముస్లింల ర్యాలీ

పిడుగురాళ్ల: పట్టణంలో ఈ నెల 25న ''ముస్లిం సమాజం పిలుస్తోంది.. కదలిరా సహోదర'' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్ తెలిపారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఏడు కొట్ల సెంటర్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా పాల్గొనాలని ఆయన కోరారు.

భావితరాలకు అంబేడ్కర్ ఆదర్శం

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి: నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణ సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు పెన్షనర్ బాదుగున్నల కమలాకర్‌రావు స్పాన్సర్ చేసిన బహుమతులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నవభారత నిర్మాణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోషించిన పాత్ర విశేషమైందన్నారు. ప్రపంచానికే ఆదర్శనీయమైన రాజ్యాంగాన్ని రచించిన ఆయన అపర మేధావి అని కొనియాడారు. పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఎంతో గొప్ప దార్శనికుడని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని మాట్లాడుతూ అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని, ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకటాద్రి, గద్దే మురహరి రావు, జెట్టి సైదులు, ఎల్ సుబ్బారావు, జోజిరెడ్డి, డాక్టర్ సరికొండ రమాదేవి మాట్లాడారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అర్ధ సంవత్సర పరీక్షల్లో ప్రతి తరగతిలోనూ సెక్షన్ల వారీగా అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను 50 మందిని గుర్తించి జ్ఞాపికతో పాటు రూ.100 చొప్పున నగదు, ఒక పెన్ను బాదుగున్నల కమలాకర్‌రావు సహకారంతో అందించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

నాటుసారా తాగి జీవితాలు పాడుచేసుకోవద్దు



అచ్చంపేట: నాటుసారి తాగి బంగారం లాంటి జీవితాలను పాడుచేసుకోవద్దని తహసీల్దారు జి.శ్రీనివాసరావు తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా మండలంలోని తాడువాయి పంచాయతీ పరిధి సండ్రతండా, బంగారుతండాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లకార్డుల ప్రదర్శన చేశారు. నాటుసారా వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. రహస్య స్థావరాలలో బట్టీలు పెట్టి సారా కాయడం వల్ల జైలు పాలు కావలసి వస్తుందని హెచ్చరించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి మాట్లాడుతూ నాటుసారా కాస్తూ, విక్రయిస్తూ పట్టుబడితే జీవితాంతం కుటుంబాలకు దూరంగా, జైలు పాలవ్వాల్సి వస్తుందని, కుటుంబ పోషణకు సన్మార్గాలను ఎంచుకోవాలని హితబోధ చేశారు. నాటుసారా తాగితే అధోగతి పాలవ్వక తప్పదని హెచ్చరించారు . ప్రతి ఒక్కరు పురోగతివైపు పయనించాలని, ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవాలని ఆయన చెప్పారు. అనంతరం తండావాసుల చేత సారా తయారు చేయం, విక్రయించం, తాగం, మంచి పౌరులుగా జీవిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'సర్వే'త్రా భయం..భయం

- వామ్మో..పీ–4 సర్వే !
- ప్రజలను వెంటాడుతున్న భయం
- వ్యక్తిగత సమాచారం సైతం యాప్‌లో నమోదు
- సర్వేతో నష్టం జరుగుతుందనే ఆందోళనలో ప్రజలు



దాచేపల్లి : ఏమండీ..మీకు ఎంతమంది పిల్లలు..ఏమి చదువుకున్నారు..మీ పిల్లలు ఇక్కడ ఉన్నారా...లేక విదేశాల్లో ఉన్నారా..మీ ఇంట్లో టీవీ ఉందా..ఫ్రిజ్ ఉందా..ఏసీ ఉందా..బైక్ ఉందా..ఎన్ని స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి..మీరు ప్రైవేట్ ఉద్యోగమా..లేక ప్రభుత్వ ఉద్యోగమా..మీకు నెలకు ఎంత జీతం వస్తుంది..మీకు కారు ఉందా..మీరు ఇన్‌కంట్యాక్స్ చెల్లిస్తున్నారా..ఇలా ఊపిరాడకుండా ప్రశ్నలతో పీ–4 సర్వే పేరిట సిబ్బంది ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వం ఏ పథకాలు తీసేస్తుందనే ఆలోచనతో మథనపడుతున్నారు. ఇటీవల దాచేపల్లి నగర పంచాయతీతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు.

ప్రజల్లో ఆందోళన

ఎన్నికల సమయంలో ఊకదంపుడు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు తీరా గద్దె ఎక్కిన తర్వాత ఒక్క పథకం అమలు చేయలేదు. హామీలు అమలు చేయకపోగా సర్వేల పేరుతో ఉక్కిరిబిక్కిరి చేస్తుండటం ప్రజల్ని మరింత ఆందోళనకు గురి చేస్తోంది. పీ-4 సర్వే ప్రభుత్వ పథకాలు అమలు కోసమా..లేక ప్రభుత్వ పథకాలు కోత వేసేందుకా ? అని తెలియక ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బతుకులు బాగుపడతాయని నమ్మబలికి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత అడుగడుగున మోసం చేస్తున్నారనే భావన ప్రజలకు కలుగుతోంది. కూటమి నేతల సన్నాయి నొక్కులతో ప్రజలకు ప్రభుత్వంపై విరక్తి కలిగింది.

పింఛన్‌దారుల గుండెల్లో దడ

పీ–4 సర్వేలో భాగంగా సిబ్బంది 27 రకాల వివరాలను ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఫోన్‌కి ఓటీపీని కూడా పంపిస్తున్నారు. కాయకష్టం చేసుకుని జీవించే పేదలు కాసేపు వినోదం కోసం అప్పులు చేసి టీవీ, సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తుంటారు. కుటుంబ అవసరాల కోసం బైక్‌ని కూడా కొంతమంది వినియోగిస్తున్నారు. ఇలా వివరాలన్నీ నమోదు చేయడంతో పీ–4 సర్వే సామాన్యులతో పాటు పింఛన్‌దారుల గుండెల్లో దడ పుట్టిస్తోంది.

ప్రజల్లో పలు అనుమానాలు



సూపర్ సిక్స్ హామీల అమలు పక్కన పెట్టి పీ-4 సర్వే చేయడంపై ప్రజలకు అనుమానాలు వస్తున్నాయి. ఏదో ఒక సాకు చూపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చేస్తుందనే భయం ప్రజలను వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నేతలపై కేసులు పెట్టేందుకు చూస్తుందే తప్పా ప్రజలకు మంచి చేసేందుకు పని చేయడం లేదు.

–మందపాటి రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్. నడికుడి

ప్రజలకు అవగాహన కల్పించాలి



పీ–4 సర్వేపై ప్రజలకు పలు అనుమానాలు ఉన్నాయి. వ్యక్తిగత సమాచారం కూడా సేకరిస్తున్నారు. ప్రభుత్వం కూడా ప్రజలకు అవగాహన కల్పించాలి. అనుమానాలు నివృత్తి చేయాలి. ఈ సర్వేని అడ్డుపెట్టుకుని సంక్షేమ పథకాల్లో కోత విధించడం భావ్యం కాదు.

–ఈసరాజుల ఆంజనేయరాజు, సీపీఎం నేత, దాచేపల్లి

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

బీసీ సెల్ అధ్యక్షులు కొమెర వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం గురజాల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కొమెర వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో గురాజల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులుగా ఎంపిక చేసిన కాసు మహేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో బీసీలందరిని ఒక తాటి పైకి తీసుకు వచ్చి వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. వడియరాజుల అభ్యున్నతికి సహాయ, సహకారాలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వడియరాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి, గౌరవాధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, కన్వీనర్ వేముల శివ, యువజన అధ్యక్షులు కొమెర వీరాంజనేయులు, సంఘ సలహాదారులు పులి నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు వేముల శ్రీదేవి, త్రిపురాంతకం సత్రం ప్రెసిడెంట్ దేవుళ్ల శ్రీనివాసరావు, కంబాల గురవయ్య, వేముల సాంబయ్య, కందులూరి శివయ్య పాల్గొన్నారు.

నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏడీఏ ఆర్. శిధర్‌రెడ్డి



పిడుగురాళ్ల పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పిడుగురాళ్ల: నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదని కమిషనర్ కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్. శిధర్‌రెడ్డి, ఇంట్రిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ కమిషనర్ కార్యాలయ వ్యవసాయ శాఖ అధికారి శ్రీ వి.ఎస్. సురేష్ తెలిపారు. పట్టణంలోని పలు షాపుల్లో పత్తి విత్తనాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుపు మందును తట్టుకునే హెచ్‌టీ విత్తనాల నిలవలు, అమ్మకాలకు మన రాష్ట్రంలో అనుమతి లేదని చెప్పారు. డీలర్ల దగ్గర నిల్వలు లేవని గుర్తించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ డీలర్లంతా గుర్తింపు పొందిన డిస్ట్రిబ్యూటర్ నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెంటచింతలలో..

స్థానిక విత్తనాల షాపుల్లో వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మార్పీకే అమ్మాలని, రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని వారు సూచించారు. రసీదును పంట దిగుబడి వచ్చే వరకు కూడా భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ కార్యాలయం సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్. శిధర్‌రెడ్డి , వ్యవసాయాధికారి వి.ఎస్.సురేష్, ఏఓ బి. బ్రహ్మారెడ్డి, వీఏఏలు గొంటు కృష్ణారెడ్డి, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్స్



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓలు అల్లి సురేష్, జఫ్రుల్లా ఖాన్

మాచర్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా అన్ని సౌకర్యాలను విద్యార్థులకు కల్పిస్తున్నట్లు ఎంఈఓలు అల్లి సురేష్, జఫ్రుల్లాఖాన్ తెలిపారు. పట్టణంలోని వీరభద్రాపురం స్కూల్‌లో బుధవారం ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా విద్య, పుస్తకాలు, దుస్తులు, టై, బెల్టు, షూ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, మినరల్ వాటర్ అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి సహకరించాలని వారు కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను చూసి అభినందించారు. కార్యక్రమానికి హెచ్ఎం గాదె కిరీటిరెడ్డి అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు షేక్ రెహానా, నాగమణి, ఉషారాణి, నిర్మలమేరి, ఆదిలక్ష్మి, కొర్లయ్య, కేశవరెడ్డి, ఏడుకొండలు, నాగరాజు, విద్యా కమిటీ చైర్మన్ కొమెర శాంతి, సాగర్‌బాబు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం



మాట్లాడుతున్న రవికుమార్‌రెడ్డి

మాచర్ల రూరల్: గ్రామాల్లో నాటుసారా నిర్మూలన లక్ష్యంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో నవోదయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తొమ్మిది గ్రామాలను నాటు సారా ప్రభావితంగా గుర్తించామని తెలిపారు. ఆయా గ్రామాల్లో సారా తయారీ, తాగడం వల్ల కలిగే అనర్థాలను నవోదయ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గత మూడు నెలల్లో 78 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని వెల్లడించారు. సారా తయారీకి ఉపయోగించే 10వేల లీటర్ల బెల్లం ఊటను కూడా ధ్వంసం చేసినట్లు చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. రవీంద్ర, ఎఈఎస్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మామిడి తోటల పరిశీలన

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు, ఆవులవారిపాలెం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మామిడి తోటలను బుధవారం హార్టీకల్చర్ అధికారి నవీన్‌కుమార్, రైతు సేవా కేంద్రం సహాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌వో మాట్లాడుతూ మామిడి సాగులో అధిక దిగుబడులు పొందేందుకు, పూత, కాయ దశలో చీడపీడల నుంచి ఎటువంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలో రైతులకు తెలియజేసినట్లు చెప్పారు. మండలంలో మొత్తం 240 ఎకరాల్లో మామిడి పంట సాగు చేస్తున్నారని తెలిపారు. వేకువజామున వచ్చిన భారీ గాలివానకు కాయ నష్టమేమి జరగలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు హరికృష్ణ, కమల, ఎంపీఈఓ దివ్య, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానపరిచిన వారిని అరెస్ట్ చేయాలి

క్రోసూరు: కాకినాడ జిల్లా శంఖవరం ఎస్సీ కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమానపరిచిన వారిని గుర్తించి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి రోజునే ఇలాంటి సంఘటన జరగటం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంట్‌ను, ప్రజలను అవమానించటమేనని గార్లపాటి దాసు అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు ఎదురుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే రక్షణ కల్పించిన వారవుతారని దాసు అన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



బాలాజీ టవర్స్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పిడుగురాళ్ల: అగ్ని ప్రమాదాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపకశాఖ అధికారి కె. శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని కళ్లం టౌన్‌షిప్‌లోని బాలాజీ టవర్‌లో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్యాస్ పొయ్యి వద్ద మంటలు వ్యాప్తిస్తే కంగారు పడకుండా అదుపు చేసే విధానాన్ని వివరించారు. ప్రాథమికంగా చేయాల్సిన వాటిపై ప్రతి మహిళకు అవగాహన ఉండాలని, లేకపోతే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం మహిళలకు మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్. శ్రీనివాసరెడ్డి, పి.వి.సుబ్బారెడ్డి, ఎస్‌కే టీపీ బాద్షా, సీహెచ్. పిచ్చియ్య, బి. వెంకటేశ్వర్లు నాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన కోటేశ్వరరావు



కోటేశ్వరరావు దంపతులకు సన్మానం

మాచర్ల రూరల్: ఉపాధ్యాయ వృత్తికి పేరు తెచ్చిన కొరటూ కోటేశ్వరరావు వ్యక్తిత్వం అందరికీ ఆదర్శనీయమని పల్నాడు జిల్లా పులిచింతల ప్రాజెక్టు డెప్యూటీ కలెక్టర్ వరదా సుబ్బారావు అన్నారు. పట్టణంలోని జెడ్పీహెచ్ బాలుర పాఠశాలలో బుధవారం పదవీ విరమణ చేస్తున్న కోటేశ్వరరావు దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా డెప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు బోధనతో పాటు తోటి ఉపాధ్యాయులతోనూ స్నేహపూర్వకంగా మెలుగుతూ అందరి వాడిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఎంఈఓలు సురేష్, జఫ్రుల్లా ఖాన్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తీసుకొచ్చిన కోటేశ్వరరావు పనితీరు అభినందనీయమని పేర్కొన్నారు. హెచ్ఎం ఎం.రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు, హెచ్ఎంలు ఐ.వి. నాగమణి, సకీనా, విజయకుమారి, రంగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి



కందుకూరికి నివాళులర్పిస్తున్న హెల్ప్ ఫౌండేషన్ నిర్వాహకులు

సత్తెనపల్లి: స్త్రీ విద్యను, వితంతు వివాహాలను ప్రోత్సహించి దురాచారాలను నిర్మూలించడంలో ప్రముఖ పాత్ర వహించిన వ్యక్తి వీరేశలింగం అని, యువజన సంఘాల స్థాపన ఆయనతోనే ప్రారంభమైందని హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అన్నారు. నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు పట్టణంలోని సాయికృష్ణ థియేటర్ ఎదురు గల టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ సమాజ సేవ కోసం హితకారిణి సంస్థను స్థాపించి తన యావదాస్తిని దానికి అంకితం చేసిన మహనీయుడు, గొప్ప మానవతావాది వీరేశలింగం పంతులు అని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ స్త్రీలకు విద్య, స్వాతంత్ర్యం అనేవి కలగా ఉన్న రోజుల్లో వాటిని హక్కులుగా మార్చిన మహనీయుడు కందుకూరి వీరేశలింగం అని కొనియాడారు. ముందుగా వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై ఆరుగురికి గాయాలు



కాలిపోయిన వస్తువులు



గాయపడిన మహిళ

చిలకలూరిపేటటౌన్: టిఫెన్ సెంటర్లో గ్యాస్ సిలిండర్ లీక్ అవ్వడంతో ఆరుగురికి గాయాలై పెనుప్రమాదం తప్పిన సంఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని భావనరుషి నగర్ మొదటిలైనులో జాలయ్య, వెంకటరమణ దంపతులు గత పదేళ్లుగా చిన్నదుకాణం ఏర్పాటు చేసుకుని టిఫెన్ సెంటర్‌ను నడుపుతున్నారు. రోజు మాదిరిగానే దుకాణం తెరిచి గ్యాస్‌పొయ్యి వెలిగించే క్రమంలో రెగ్యులేటర్ వద్ద గ్యాస్‌లీక్ కావడంతో మంటలు వ్యాప్తి చెందాయి. గమనించిన స్థానికులు మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించగా వారికి మంటలు అంటుకుని గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న చిలకలూరి పేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. సిలిండర్ లోని గ్యాస్ అంతా అయ్యే వరకు పూర్తిగా మంటలు పెద్ద ఎత్తున రావడంతో దుకాణం, అందులోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. గాయాలపాలైన నిర్వాహకులిద్దరితో పాటు శ్రీనివాసరావు, సీతారావమ్మ, కోటేశ్వరరావు, ఆదిబాబులను పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి అగ్నిమాపక సిబ్బంది ప్రైవేటు వాహనంలో తరలించారు.

ప్రారంభమైన ఆరాధనోత్సవాలు

నాదెండ్ల: గణపవరం సినిమా హాల్ రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణాంజనేయ స్వామి ఉపాసకులు అచల దాసునాయన మఠం 86వ ఆరాధనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటూ జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు దాసునాయన, ఆయన శిష్యుల సమాధులకు పూజలు చేశారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పెదనందిపాడుకు చెందిన గురువు వీఎస్ఆర్ ఆంజనేయులు ప్రవచనాలు చేశారు. 18న భారీ అన్నదాన కార్యక్రమం జరగనుంది. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేడు చెన్నుని రథోత్సవం

తరలి రానున్న వేలాది మంది భక్తులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్ కుమార్, ఈఓ పూర్ణచంద్రరావు

మాచర్ల రూరల్: పల్నాటి ప్రజల ఆరాధ్య దైవం, భక్తుల కొంగు బంగారమైన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరగనుంది. పల్నాటి ప్రాంతం నుంచే కాకుండా రెండు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకుంటారు. దశాబ్దాల చరిత్ర ఉన్న రథం లాగేందుకు యువత పెద్ద ఎత్తున పోటీ పడుతూ ఉత్సాహంతో పాల్గొంటారు. బ్రహ్మనాయుడు చాపకూటి సిద్ధాంతం అనుగుణంగా అన్ని కుల, మతాల వారు పాల్గొనడం ప్రత్యేకత.

రథంపై వీరికి మాత్రమే అనుమతి

వేలాది మంది భక్తి పారవశ్యంతో కదిలే చెన్నుని రథోత్సవంపై దేవస్థాన అర్చకులు నలుగురు, కంచు కాగడాలు వెలిగించే వారు నలుగురు, కరణాలు నలుగురు, రథం తయారు చేయించిన కంచనపల్లి వంశస్థులు ఒకరు, నగార వాయించటానికి ఇద్దరు, మైకు సెట్లు ఏర్పాటుకు ఇద్దరు, రథాన్ని ముందుకు నడిపించే వ్యాఖ్యాత ఒకరు, ట్రస్టు బోర్డు చైర్మన్ ఒకరు మాత్రమే రథం పైకి అనుమతి ఉంటుందని ఈఓ పూర్ణచంద్రరావు తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన తహసీల్దార్

రథోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్ బి. కిరణ్ కుమార్ ఈఓ పూర్ణ చంద్రరావుతో చర్చించారు. స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి ప్రాంగణంలోని రథాన్ని బుధవారం ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు అందించారు. వేలాది మంది పాల్గొనే రథోత్సవానికి ఆటంకం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.

మద్యం మత్తులో యువకుడిపై కత్తితో దాడి



పిడుగురాళ్ల: పాత కక్షల నేపథ్యంలో మద్యం మత్తులో యువకుడిపై దాడి చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీరామ్ వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని లెనిన్‌నగర్ స్తూపం సెంటర్ ప్రాంతానికి చెందిన వేణు, గోపాల్‌లు గత వినాయక చవితి సమయంలో ఘర్షణ పడ్డారు. పెద్దలు ఇద్దరికీ సర్ది చెప్పారు. అప్పటి నుంచి అప్పుడప్పుడు మద్యం మత్తులో గొడవ పడుతుండేవారు. బుధవారం రాత్రి కూడా మద్యం తాగి గొడవ పడ్డారు. ఈ సమయంలో గోపాల్ ఫ్లెక్సీ బోర్డును కట్ చేసే చాకును వేణు పైకి విసిరి వేశాడు. అది అతడి ఎడమ పొట్టకు తగిలి గాయమైంది. బాధితుడిని నరసరావుపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వేణు పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. గోపాల్, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

సోలార్ లైట్స్ కొనుగోలుకు వితరణ



అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం గ్రామ పంచాయతీకి 15 సోలార్ వీధి లైట్స్ కొనుగోలు చేసేందుకు స్నేహహస్తాలు ఫౌండేషన్ బుధవారం సర్పంచ్ పోట్ల శ్రీనివాసరావుకు ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు చేతులమీదుగా రూ.1.10 లక్షల చెక్కును అందజేసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, విద్యాభివృద్ధిలో స్నేహహస్తాలు ఫౌండేషన్ చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. గ్రామంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా ఉండేందుకు సోలార్ విద్యుత్ వీధి లైట్లు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. వీటి వల్ల విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో సోలార్ ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందని, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని స్నేహహస్తాలు గ్రామాల అభివృద్ధికి ముందడుగు వేయడం మంచి పరిణామమన్నారు. గ్రామాభివృద్ధి సంఘ చైర్మన్ తుమ్మా శౌర్రెడ్డి, మొక్కపాటి గిరిబాబు, బత్తుల శ్రీనివాసరావు, స్నేహహస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు పాల్గొన్నారు.